ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు

మంగళవారం 13 ఫిబ్రవరి 2024

ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించండి

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 12: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతగా అర్జీలను పరిష్కరించడం అత్యంత కీలకమన్నారు. రీఓపెన్ కాకుండా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. పెండింగ్ ఉన్న అర్జీలను అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో, మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్టంగా ప్రాధాన్యతతో నిర్వహించాలని డివిజన్, మండల అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలు స్వీకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 21 ప్రాజెక్టులు ఎంపిక

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 12: జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌మనక్‌లో 245 ప్రాజెక్టులు ఏర్పాటు చేయగా అందులో నుంచి రాష్ట్ర స్థాయికి 21 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఆ ప్రాజెక్టులను ఢిల్లీలోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి వచ్చిన ప్రతినిధులు స్వరాజ్‌ఫరీదా, శుభ్రత్‌కుమార్ బారిక్‌లు పరిశీలించి వాటి నుంచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు 21 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. రాజశేఖర్ నాయక్ (తంబళ్లపల్లె మండల బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్), కార్తీక్ (కన్నెమడుగు జిల్లా పరిషత్ హైస్కూల్, అదే పాఠశాల నుంచి ఎ.సుమంత్), ఎస్.రుక్సానా (కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్), నేహత్‌కృష్ణ (కలికిరి సైనిక్ స్కూల్), ఎస్, ఫారూక్ (టి.చదివేవాండ్లపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్), సప్తగిరీశ్వర్‌రెడ్డి (మదనపల్లె మండలం జ్ఞానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్), పి.గౌసియా (నోబెల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్) ఎంపికయ్యారు. అలాగే ఆర్ఎస్ జోహార్ అనుమ్ (పీపుల్ ట్రీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్), భరత్‌కుమార్ (కురబలకోట మండలం తెట్టు జిల్లా పరిషత్ హైస్కూల్), సఫియా (పీటీఎం మండలం ఉర్దూ హైస్కూల్), నాగేశ్వరి (పెద్దమండెం మండలం సిద్దవరం కేజీబీవీ), హిమవర్ష (పీలేరు మండలం జిల్లా పరిషత్ హైస్కూల్), లిఖిత (కోటపల్లి గర్ల్స్ హైస్కూల్), బిందు (కోడూరు మండలం ఆర్.రాచపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్), తరుణ్‌కుమార్ (లక్కిరెడ్డిపల్లె మండలం ఏపీ మోడల్ స్కూల్), విష్ణువర్ధన్ (ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్), వెంకటసాయి రోహిత్ (రాజంపేట మండలం శ్రీసాయి విద్యాలయ హైస్కూల్), గాయత్రి (గుండ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్), హిందూ దుర్గా (రాయచోటి మండలం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్), పి.అంజలి (సంబేపల్లె మండలం జిల్లా పరిషత్ హైస్కూల్)లు ఉన్నారు. వీరందరూ ఏప్రిల్ నెలలో చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొంటారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

ఎన్నికల కోసమేనా..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- యూనివర్సిటీగా బీటీ కళాశాల
- క్యాబినెట్ సమావేశంలో లేని ప్రస్తావన
- విపక్షాలు, విద్యార్థి సంఘాల ఆందోళనలతో హడావిడిగా జీవో జారీ
- నెల రోజుల్లో సాకారం అయ్యేనా..?



బీటీ కళాశాలలోని ఏడీ బిల్డింగ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 12: బీటీ కళాశాలను యూనివర్సిటీగా మారుస్తూ జీవో జారీ చేయడం కేవలం ఎన్నికల కోసమేనని విద్యార్థి సంఘాలతో పాటు ప్రతిపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు. ఏళ్ల తరబడి దీని కోసం పోరాటాలు చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం క్యాబినెట్ మీటింగ్‌లో కూడా దీని ప్రస్తావన చేయకుండా ఉన్నట్లుండి జీవో జారీ చేయడంలో రాజకీయం దాగుందని విమర్శిస్తున్నారు. కేవలం నెలరోజుల వ్యవధిలోనే యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యమయ్యే పని కాదని, ఐదేళ్ల నుంచి పట్టించుకోని ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇలా ప్రకటించడం ఓట్ల కోసమేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గత నెల 26వ తేదీ మదనపల్లెలో జరిగిన బహిరంగసభలో బీటీ కళాశాలను యూనివర్సిటీగా మారుస్తామని ఎంపీ మిధున్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ జనవరి 31వ తేదీ జరిగిన క్యాబినెట్ సమావేశంలో అసలు బీటీ కళాశాలను యూనివర్సిటీగా మార్చు చేసే ప్రస్తావనే రాలేదు. దీనిపై ఎంపీ మిధున్‌రెడ్డి మాటలు బుట్టదాఖలు, తుస్సుమన్న బీటీ యూనివర్సిటీ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఫిబ్రవరి 1వ తేదీ వార్త ప్రచురితమైంది. దీనిపై మదనపల్లెలో బీటీ కళాశాల పూర్వ విద్యార్థులు, మేధావులు ప్రెస్‌మీట్లు పెట్టి బీటీ కళాశాలను యూనివర్సిటీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వైసీపీ నాయకులు ఉలిక్కిపడ్డారు. సీఎం జగన్‌కు సన్నిహితంగా ఉండే మిధున్‌రెడ్డి మాటలే చెల్లకుంటే ఎలా అని మదనపల్లె ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. అంతే మదనపల్లె వైసీపీ నాయకులు బీటీ కళాశాల యూనివర్సిటీగా మారిపోయిందంటూ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఈనెల 7వ తేదీ బీటీ కళాశాలకు వెళ్లి అక్కడ జగన్, మిధున్ ఫొటోలకు పాలాభిషేకం చేశారు. కనీసం జీవో విడుదల కాకుండానే మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వకర్త నిస్సార్‌అహ్మద్ ఇలా సంబరాలు చేయడాన్ని పలువురు తప్పుపట్టారు. ఏడాది కాలంగా ఊరిస్తూ వస్తున్న వీరి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో వైసీపీ ప్రభుత్వం ఉలిక్కి పడిందేమో కానీ ఆఘమేఘాలపై ఈనెల 9వ తేదీ బీటీ కళాశాలను అనిబీసెంట్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో నెంబరు 9 విడుదల చేసింది.

బీటీ కళాశాల ప్రస్థానం ఇలా..

స్వాతంత్ర్యం రాక ముందే ఐరిష్ వనిత అనిబీసెంట్ మదనపల్లెలో బీసెంట్ థియోసిఫికల్ కళాశాల ఏర్పాటు చేశారు. లక్షలాది మంది ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించారు. ఈ క్రమంలో గత ఏడాది ఎయిడెడ్ విద్యాసంస్థల ఆస్తులను ప్రభుత్వపరం చేస్తే, ఆయా కళాశాలను ప్రభుత్వ పరం చేసుకుంటానమని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బీటీ కళాశాల ఎదుట 100 రోజులకు పైగా నిరసన దీక్షలు నిర్వహించారు. ప్రభుత్వంలో స్పందన రావడంతో బీసెంట్ సెనెటరీ ట్రస్టు చేతిలో ఉన్న బీసెంట్ థియోసిఫికల్ కళాశాలను ప్రభుత్వ పరం చేస్తూ, 11.8 ఎకరాల స్థలాన్ని, అందులోని భవనాలను, సామాగ్రిని, సిబ్బందిని ప్రభుత్వ పరం చేశారు. కానీ మిగిలిన ఆస్తులను మాత్రం ప్రభుత్వానికి అప్పగించలేదు. ఇప్పటి వరకు ప్రభుత్వానికి అప్పగించిన ఆస్తులు రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని సమాచారం. ఇదిలా ఉండగా మదనపల్లె ప్రాంత విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులు, రీసెర్చ్ (పరిశోధనలు), ఉన్నత చదువులు చదివేందుకు 110 కిలోమీటర్ల దూరంలోని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీపైనే ఆధారపడి ఉన్నారు. దీంతో బీటీ కళాశాల విశ్వవిద్యాలయంగా మార్చాలని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. గత ఏడాది కళాశాలను ప్రభుత్వ పరం చేసే సందర్భంగా బీటీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ మిధున్‌రెడ్డి బీటీ కళాశాలను విశ్వవిద్యాలయం చేస్తామని చెప్పారు. అప్పటి నుంచి ఈ తతంతమంతా సాగుతూ వచ్చింది కానీ అడుగులు మాత్రం ముందుకు పడలేదు. ఈ క్రమంలో ఏపీఎస్‌హెచ్‌సీఈ ఆధ్వర్యంలో బీటీ కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన సమాచారాన్ని, సవివరమైన డీపీఆర్ (డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు) నివేదికలను పంపారు. ఈ క్రమంలో ఎట్టకేలకు ఈనెల 9వ తేదీ ప్రభుత్వం జీవో 9 ఉత్తర్వుల ప్రకారం అనిబీసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఇన్‌చార్జి) బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల రోజుల్లో సాకారమయ్యేనా..?

బీటీ కళాశాలను విశ్వవిద్యాలయం చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసినా ఈ తతంగమంతా నెల రోజుల్లో (ఎన్నికల నోటిఫికేషన్)కు ముందే సాకారమయ్యేనా అన్నదే ప్రశ్నార్థకంగా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అనిబీసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినా అది నెల రోజుల్లో ప్రారంభయ్యే చాన్సే లేదని విద్యావంతులు, మేధావులు అంటున్నారు. వాస్తవంగా ఒక యూనివర్సిటీ స్థాపించాలంటే కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నుంచి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి ప్రతిపాదనలు వెళ్లాలి. అక్కడి నుంచి యూజీసీ యాక్ట్ 1956 ప్రకారం విస్తారమైన స్థలం, భవనాలు, రీసెర్చ్ స్కాలర్స్, మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు జరగాల్సి ఉంది. ఇదంతా జరిగే పని కాదని కొందరు పెదవి విరుస్తున్నారు. బీటీ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టకుండా ఏడాదిగా నింపాదిగా ఉన్న వైసీపీ ప్రభుత్వం తీరా ఎన్నికల వేళ అనిబీసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు జీవో విడుదల చేయడం అంతా ఎన్నికల స్టంటే అని పలువురు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

● వైజ్ఞానిక ప్రదర్శనలతో వెలుగులోకి సృజనాత్మకశక్తి

● జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఇన్‌చార్జి డీఈవో



ఇన్‌స్పైర్‌మనక్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 12: విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలుగులోకి వస్తుందని ఇన్‌చార్జి డీఈవో శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని డైట్ విద్యా కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్ననాటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యున్నత స్థానానికి ఎదగాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సైన్స్‌తోనే అది సాధ్యమవుతుందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా విద్యార్థులు పరిశీలించడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చునని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చన్నారు. డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ గురువులపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలని సూచించారు. సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జిల్లా నుంచి 245 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించడానికి ఢిల్లీలోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి ప్రతినిధులు స్వరాజ్, ఫరీదా, శుభ్రత్‌కుమార్ భారిక్ వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, ఏఎంవో రామకృష్ణ, ఎంఈవో బాలాజీనాయక్, జీసీడీవో రాధ, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా అసిస్టెంట్ సైన్స్ ఆఫీసర్ రామచంద్ర, ఆప్కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, ఆప్కాస్ట్ అకడమిక్ కో-ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ భూమి జోలికొస్తే ఊరుకోము

● దీక్షలు చేసైనా సరే కాపాడుకుంటాం ● భగ్గుమన్న విపక్షాలు, ప్రజాసంఘాలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 12: సీఎం జగన్ చరిత్రపై యాత్ర-2 సినిమా తీసిన డైరెక్టర్ మహీ వి.రాఘవకు హార్సిలీహిల్స్‌లో 2 ఎకరాల భూమిని కట్టబెట్టాలని చూస్తే ఊరుకోమని విపక్షాలు ఆగ్రహించాయి. దీక్షలు చేసైనా సరే ప్రభుత్వ భూమిని కాపాడుకుంటామని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఎలుగెత్తి చాటాయి. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, బహుజనసేన ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను కరపత్రాలు లాగా పంచేస్తున్నారన్నారు. జగన్‌ను పొగిడిన వారికి భూపందేరాలు చేస్తున్నారని, ఇలాగే ఉంటే ప్రభుత్వ స్థలం ఎక్కడా మిగలదన్నారు. మదనపల్లె జిల్లా కేంద్రం కోసం తాము ఆందోళనలు చేస్తే తప్పుడు కేసులు పెట్టి కోర్టులకు తిప్పుతున్నారన్నారు. జనసేన రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి మాట్లాడుతూ రూ.20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని యాత్ర డైరెక్టర్‌కు కట్టబెట్టాలని చూడటం విచారకరమన్నారు. మదనపల్లె మీదుగా బెంగళూరుకు కడప నుంచి రైలు మార్గం నిర్మించకుండా పులివెందుల వైపు తిప్పుకున్న సీఎం, మదనపల్లె అభివృద్ధికి చేసిందేమి లేదన్నారు. టీడీపీ బీసీ విభాగం పార్లమెంట్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో హార్సిలిహిల్స్‌లో క్రీడా ప్రాంగణానికి 3.74 ఎకరాలు కేటాయించి రూ.1.6 కోట్లతో ప్రహరీ నిర్మాణం చేపట్టారన్నారు. ఇప్పుడు జగన్ చూస్తే యాత్ర-2 డైరెక్టర్‌కు 2 ఎకరాల భూమిని అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారన్నారు. ఎలాంటి పరిస్థితిలో కూడా ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకుంటామన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ జగన్ విధానాలు ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్తులను యాత్ర-2 డైరెక్టర్‌కు కట్టబెట్టాలనుకోవడం ప్రజలకు అన్యాయం చేసినట్టే అన్నారు. సీపీఐ కృష్ణప్ప, మురళి, బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ డైరెక్టర్ మహీపై ప్రేమ ఉంటే ఇడుపులపాయ ఎస్టేట్‌లో రెండెకరాల భూమిని ఇవ్వాలని జగన్‌కు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, రాటకొండ మధుబాబు, ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, దొమ్మలపాటి యశశ్విరాజ్, గుత్తికొండ త్యాగరాజు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ, జనసేన, సీపీఐ నాయకులు



సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సహజ వనరుల దోపిడీ

● మదనపల్లెలో ప్రకృతిపై పగబట్టారు ● ఇసుక, మట్టి అక్రమ రవాణా ● వాల్టా చట్టానికి తూట్లు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12: ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అడవులు, వంకలు, వాగులు, నదులు, చెరువులు, పెద్ద పెద్ద వృక్షాలు తదితర సహజ వనరులను కాపాడుకుంటేనే అవి మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడతాయి. వర్షాలు సమృద్ధిగా కురవడానికి చెట్లు ఎంతగానో దోహదపడతాయి. అయితే అంతా తెలిసి కూడా మానవుడు ప్రకృతిపై పగబట్టి సహజ వనరులైన భూములు, నదులు, చెరువులు, వాగులు, వంకలను అక్రమించేస్తున్నారు. భూగర్భజలాలు పెరగకుండా నదులు, వంకల్లో ఇసుకను తోడేస్తూ ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వం భూముల్లో, గుట్టల్లో, కొండలను తవ్వి అక్రమమట్టిని తరలించడంతో సహజవనరులు కనుమరుగవుతున్నాయి, ప్రకృతి పరంగా అభించే వనరులపై దాడి చేసే సంస్కృతి గతంతో పోల్చుకుంటే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఎక్కువైంది. జిల్లావ్యాప్తంగా అనుమతులు ఉన్నా లేకపోయినా ఎక్కడ చూసినా ఇసుక, మట్టి, కలప, అక్రమ రవాణా సాగుతోంది. అధికార పార్టీ నేతల అండదండలతో పల్లె నుంచి పట్టణానికి ఇసుక, మట్టిని అక్రమంగా వివిధ మార్గాల గుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు వర్షాబావ పరిస్థితులు, తాగునీరు, సాగునీరు సమస్యలు తలెత్తి రైతులు సాగుచేసే పంటలు కూడా పూర్తిస్థాయిలో దిగుబడి రాక కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో, బాహుదా కాలువలో, బగ్గవంకలో, సీటీఎం చెరువులో, నిమ్మనపల్లె రోడ్డులోని వంకల్లో, ఆరోగ్యవరం సమీపంలోని గుట్టలో, రామిరెడ్డిగారిపల్లె సమీపంలోని గుట్టల్లో అక్రమంగా మట్టి, ఇసుక పట్టణానికి తరలించి అమ్మకాలు చేస్తున్నారు. ప్రతిరోజూ సమారు వందల లోడ్లు అక్రమంగా తరలిపోతున్నాయి. కలపను పొన్నూటిపాలెం అడవుల నుంచి అక్రమంగా తరలించి పట్టణ సమీపంలో కనకదాస్‌నగర్ వద్ద ఏర్పాటు చేసుకున్న ఇటుకల బట్టీలకు రాత్రింబవళ్ల తేడా లేకుండా అక్రమంగా మట్టి, కలపను తరలిస్తున్నారు. ప్రభుత్వ నిర్మాణాల పేరుతో అక్రమార్కులు వేల లోడ్లు అక్రమంగా తరలించి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న అక్రమ లేవుట్‌లకు వినియోగిస్తున్నారు.



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప

వాల్టా చట్టానికి తూట్లు..

పెద్ద పెద్ద వృక్షాలను అక్రమంగా నరికివేయకుండా ప్రభుత్వం వాల్టా చట్టం తీసుకొచ్చింది. అయితే అక్రమార్కులు మాత్రం వాటిని తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా పెద్ద పెద్ద వృక్షాలనే నరికి కొయ్యల మండీలకు, ఇటుకల బట్టీలు కాల్చడానికి అక్రమమార్గంలో రాత్రిపూట తరలిస్తున్నారు. చెక్ పోస్టుల్లో మామూళ్లకు అలవాటుపడిన సిబ్బంది వాహనాలను తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్



అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం..

వాల్టా చట్టానికి తూట్లు పెట్టి అక్రమంగా మట్టి, ఇసుక తదితరాలు తరలించడం చట్టరీత్యా నేరం. మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమాలు జరుగుతుంటే చర్యలు చేపడతాము. అలా అనుమతులు లేకుండా ఇసుక, మట్టి, కలప అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం. వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. అనుమతులు లేకుండా మండలంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదు. అతిక్రమించి సహజ సంపదను కొల్లగొడితే వారిపై కఠిన చర్యలు తప్పవు.

- పి.రమాదేవి, తహసీల్దార్, మదనపల్లె మండలం



ఎక్స్‌కవేటర్‌తో గుట్టను తొలచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

సైబర్ నేరాలను కట్టడి చేయాలి

● సైబర్ క్రైం అవగాహన సదస్సులో ఎస్పీ కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాజంపేట, ఫిబ్రవరి 12: సోషల్ మీడియాతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ఈ నేరాలు అరికట్టడానికి పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జిల్లాలోని పోలీసులకు సైబర్ నేరాలపై సోమవారం ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై పోలీసులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉన్నప్పుడే వీటిని పూర్తి స్థాయిలో అరికట్టడానికి వీలుంటుందన్నారు. సైబర్ నేరాల వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులకు సైబర్ నేరాలపైన సరైన అవగాహన లేకపోవడం వల్లే క్రైం రేటు పెరిగిపోతోందని, అందుకోసమే ప్రతి జిల్లాలోని పోలీసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ ఏఐ సైబర్ సెక్యూరిటీ ఎంజిఐయుఎస్‌ఏ డైరెక్టర్ ఉదయ శంకర్ పురానిక్ మాట్లాడుతూ ప్రతి పోలీసు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉన్నపుడే సైబర్ క్రైమ్ రేటును తగ్గించవచ్చన్నారు. వీటిపై పోలీసులంతా అప్రమత్తంగా ఉండి ఇటువంటి సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో సైబర్ నేరాలపై ప్రత్యేక సెమినార్లు నిర్వహిస్తూ విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ముంబై ఐటీ నిపుణులు డాక్టర్ వివేకానంద మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నేడు సోషల్ మీడియా ద్వారా పెరుగుతున్న సైబర్ నేరాలపై దృష్టి సారించి వాటి నివారణకు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చైతన్య, అన్నమాచార్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, కళాశాల డీన్ సుబ్బారావు, ఎన్ఎస్ అధికారి ఓబులపతి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కలికిరిని కమ్మేసిన మంచు

కలికిరి, ఫిబ్రవరి 12: నాలుగైదు రోజులుగా రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో అకస్మాత్తుగా సోమవారం ఉదయం దట్టమైన మంచు ఆవరించింది. సమీప పరిసరాలు కూడా కనిపించనంతగా మంచు కప్పేసింది. ఉదయం 8 గంటల వరకు కూడా వాహనాలను నడిపించడం ఇబ్బందిగా మారింది. ఉష్ణోగ్రత 15 డిగ్రీలకు లోగా పడిపోయింది. వాతావరణంలో వచ్చిన మార్పు మామిడి పంటల పూతపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.



కలకడ మార్గంలో నాలుగు లేన్ల హైవే ఫ్లై ఓవర్ వద్ద మంచు

మాపై దయ చూపండి

- 18 నెలలుగా అందని వేతనాలు
- కుటుంబ పోషణ కష్టంగా ఉంది
- పారిశుధ్య కార్మికుల ఆవేదన

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 12: వాళ్లంతా వీధుల్లో చెత్తా చెదారం శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుంటారు... అయితే వీళ్లకు 18 నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని.. తాము ఏదైనా రోగం వస్తే బాగు చేయించుకోవడానికి వైద్య ఖర్చులకు డబ్బులు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

బ్రహ్మంగారిమఠం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో జనాభా బట్టి అక్కడున్న సర్పంచ్‌లు గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల (క్లాప్‌మిత్ర)ను ఎంపిక చేసుకున్నారు. మండలంలో మేజరు పంచా యతీ అయిన సోమిరెడ్డిపల్లె పంచాయతీలో 15 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం దేవస్థానం ఉండడంతో ఇక్కడికి దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తూ పోతూ వుంటారు. యాత్రికులు రోడ్లపై వేసే చిత్తు కాగితాలు, చెత్త చెదారాలను పారిశుధ్య కార్మికులు శుభ్రపరుస్తుంటారు. అలాగే ప్రతిరోజూ ఇంటి వద్ద నుంచి తెల్లవారుజామున 4గంటలకు బయల్దేరి పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని.. అక్కడ నుండి ట్రైసైకిళ్లు తీసుకుని ప్రతి గ్రామానికి వెళుతూ రోడ్లపై ఉన్న చెత్త చెదారాన్ని ఊడుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుంటారు. ఇలా మండల వ్యాప్తంగా 124 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.6వేలు వేతనం ఇచ్చేవారు. అది కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోకపోయినా కూడా పనిచేసేవాళ్లమని.. ఆ ఇచ్చే వేతనం ప్రతి నెలా మంజూరు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని.. దీంతో మా కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


జీతాలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్న పారిశుధ్య కార్మికులు


వీధుల్లో చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

వైద్య ఖర్చులకు డబ్బులు లేవు



ప్రతిరోజూ ఎంతో కష్టపడి వీధుల్లోని చెత్తా చెదారం ఊడ్చి శుభ్రప రుస్తాం. మా కష్టానికి ప్రతిఫలం అందడం లేదు. మాకు ఇస్తున్న చాలీచాలని జీతం కూడా... నెలల తరబడి ఇవ్వడం లేదు. దీంతో ఏదైనా జబ్బు చేస్తు.. కనీసం వైద్య చికిత్సలు చేయించు కోవడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవు. వెంటనే తమకు ఇవ్వాలని వేత నాలను ప్రభుత్వం మంజూరు చేయాలి.

-కటారి జయరాములు, పారిశుధ్య కార్మికుడు

కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది



18 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాన్ని పోషించు కోవడానికి చాల ఇబ్బందిగా ఉంది. ప్రతిరోజూ విధులకు రమ్మని అధికారులు పిలుస్తారు.. కానీ తమ వేతనాల గురించి పట్టించు కోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పం దించి జీతాలు మంజూరు చేసి తమ కుటుం బాలను ఆదుకోవాలి.

-కోడూరు చిన్నప్ప, పారిశుధ్య కార్మికుడు

విద్యుత్ బకాయిలు మార్చికి పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 12: పెండింగులో ఉన్న విద్యుత్ బకాయిలను మార్చి నాటికి పూర్తి చేయాలని అడ్మినిస్ట్రేటివ్ చీఫ్ జనరల్ మేనేజరు రమాదేవి, రెవెన్యూ చీఫ్ జనరల్ మేనేజరు ధర్మజ్ఞాని అన్నారు. సోమవారం ఉదయం విద్యుత్ భవన్‌లో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పేరుకుపోయిన బకాయిలను మార్చి చివరి తేది నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యుత్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేస్తూ.. పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సీనియర్ అకౌంట్ ఆఫీసరు మధుకుమార్, అకౌంట్ ఆఫీసరు మల్లిఖార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్ట చెరువు చేరిన సోమశిల వెనుక జలాలు


నీరు విడుదలవుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 12: ఒంటిమిట్ట చెరువుకు సోమవారం కుడమలూరు వద్ద నుంచి సోమశిల వెనుక జలాలను పైపులైను ద్వారా వదిలారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఐదు సంవత్సరాలుగా నీటిని వదలక పోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో స్థానిక నాయకులు, అధికారులు గత కొద్ది రోజులుగా పైపులైనుకు మరమ్మతు పనులను చేపట్టారు. సోమశిల ఎత్తిపోతల పథకానికి మెయింటినెన్స్ కింద డబ్బులు లేకపోవడం, మోటార్లను ఉపయోగించ కపోవడంతో చెరువుకు ఐదేళ్లుగా నీటి విడుదల చేపట్టలేదు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల్లో వ్యతిరేక తొలగించేందుకు మళ్లీ ఇప్పుడు హడావుడిగా చెరువు నీరు విడుదల చేపట్టారు. ఏదేమైనా వేసవికాలం రానున్న నేప థ్యంలో తాగు, సాగు నీటికి కొంత మేర ఇబ్బంది ఉండదని.. చెరువుకు నీరు చేరడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే చెరువుకు నీళ్ల ఎన్ని రోజులు మోటార్ల ద్వారా విడుదల చేస్తారో అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- 21 వాహనాలు స్వాధీనం
- ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వెల్లడి


మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, పక్కన డీఎస్పీ సీఐలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న బత్తల అంకయ్య అనే వ్యక్తిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి.. 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరులో ద్విచక్ర వాహనాలు దొంగతనాలు పెరిగిపోయాయని వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారన్నారు. చాపాడు మండలం చిన్న వరదాయపల్లెకు చెందిన గొర్ల ఈశ్వరయ్య అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం జనవరి 26వ తేదీ ప్రొద్దుటూరు పాత బస్టాండ్ వద్ద ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు. కేసు విచారణలో భాగంగా బత్తల అంకయ్య అనే నిందితుని పొట్టి పాడురోడ్డులోని సింగం ఫంక్షన్ హాలు దగ్గర అరెస్ట్ చేశారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు... ఈశ్వరయ్యకు చెందిన మోటారు సైకిల్‌తో పాటు ప్రొద్దుటూరు శివారులోని పాడుబడిన ఒక ఇంటిలో దాచి ఉంచిన 20 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ కేసు విచారణలో సీఐ వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు తిరుమలయ్య, దస్తగిరి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ధనాంజనేయ ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సరిహద్దు చెక్ పోస్టుల్లో పటిష్ట బందోబస్తు

- కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- ములకలచెరువు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెల్లడి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 12 : కర్ణాటక సరి హద్దుగా ఉన్న పీటీఎం మండలంలోని అన్ని చెక్‌పోస్టులలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా దృష్ట్యా పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టినట్లు ములకలచెరువు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి. రామ్మోహన్ వెల్లడించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ' జోరుగా కర్ణాటక మద్యం విక్రయాలు' అన్న శీర్షికన కథనం ప్రచురితమవ్వడంతో స్పందించిన ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ సోమవారం పీటీఎం మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులను పరిశీ లించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి 10 లీటర్ల లోపు అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడితే కేసులు ఉండవన్నది అవాస్త వం. అయితే అటువంటి వారిని స్థానిక పోలీస్ స్టేషన్లలో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేస్తారు. కానీ అటువంటి వారు ఖచ్చితంగా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న 70 కేసులు నమోదు చేసి 85 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఇందులో 1128 లీటర్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, మద్యం తరలిస్తూ 26 వివిధ వాహనాలను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు పీటీఎం మండలంలో సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక అక్రమ రవాణాను నివారించేందుకు సరిహద్దుల్లో 4 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, పీటీఎం పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటి కప్పుడు కర్ణాటక మద్యం రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. పీటీఎం మండలంలోని ఏ గ్రామంలోనైనా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలిస్తే అటువంటి వారు 9440902534 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందిస్తే అటువంటివారి పేరును గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

అధిక కేసుల రాజీకి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) ఫిబ్రవరి 12: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 9న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులను రాజీ చేసేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన జడ్జి, డీఎల్ఎస్ఏ ఛైర్మన్ జి.శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో సోమవారం పోలీసులతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వలన డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారం అయితే తిరిగి అపీల్ చేసుకోవడానికి వీలు పడదని.. సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. ఈ ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి ఆయా పోలీస్ స్టేషన్ల వారీగా అధిక కేసుల పరిష్కారానికి తోడ్పడాలన్నారు. ఈ మీటింగ్‌లో పలువురు పోలీస్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం..కారు సీజ్

- నిందితుడి అరెస్టు
- 1350 టెట్రా పాకెట్లు, 48 క్వార్టర్ బాటిళ్లు లభ్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 12: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. సీఐ పులి శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాల్మీకిపురం రైల్వే స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ39వీ యు5483 నెంబర్ గల కారులో అను మానాస్పద సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 1350 టేట్రా మద్యం పాకెట్లు, 48 క్వాటర్ బాటిళ్లు బయటపడ్డాయి. మద్యంతో పాటుగా కారును సీజ్ చేసి, అక్రమ రవాణాకు పాల్పడిన వాల్మీకిపురానికి చెందిన వ్యక్తి నరసింహులు(36)ను అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది సతీష్, అబ్దుల్లా, రిజ్వాన్, రామచంద్రనాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో పోలీసులు సీజ్ చేసిన కర్ణాటక మద్యం

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 12:వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన కేసు లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ కిల్లారివాండ్లప ల్లెకు చెందిన టి.శ్రీనివాసులు(32) కుటుంబానికి అదే గ్రామానికి చెందిన చిన్నరమణయ్య కుటుంబానికి పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శ్రీనివాసులు ఇంటి బయట ఉండగా పాత కక్షను మనుసులో పెట్టుకొని చిన్నరమణయ్య, అతని కుమారులు రమేష్, రవిలు కర్ర, గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీనివాసులు తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయ పడిని అతడిని వాల్మీకీపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలిం చారు. బాధితుని తండ్రి పెద్దరమణయ్య ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

విజిలెన్స్ దాడులు...ఐదు సిలిండర్లు సీజ్


సిలిండర్లను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), ఫిబ్రవరి 12 : కడప నగర పరిధిలోని సీకేదిన్నె, క్రిష్ణాపురం రోడ్డులో గల హోటల్‌ను విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి మాసుం బాషా ఆదేశాల మేరకు కడప సీఎస్‌డీటీలతో కలిసి తనిఖీలు చేపట్టారు. హోటల్‌లోని ఐదు గృహావసరాల సిలిండర్లు వ్యాపారానికి వాడుతున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, బాలగంగాధర్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు, రంతుబాషా పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం?


పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు సుండుపల్లె స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి 12: పింఛా నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పింఛా జలాశయం దిగువ భాగంలో ముదుంపాడు సమీపం నుంచి అక్రమంగా ప్రతి రోజు ఇసుక తరలిస్తున్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సమాచారం. ప్రతిరోజు పింఛా నది నుంచి ఇసుకను కేవీపల్లె, పీలేరు, భాకరా పేట, రొంపిచర్లకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు సమాచారం.

జింకను కుక్కల బారినుంచి రక్షించిన హోంగార్డులు


జింకకు ప్రథమ చికిత్స చేస్తున్న హోంగార్డు సురేశ్

సుండుపల్లె, ఫిబ్రవరి 12: మండలంలోని రాయవరం గ్రామ అడవుల నుంచి దాహార్తితో రాయవరం ఏటి పరిసరాల ప్రాంతానికి సోమవారం ఉదయం జింక వచ్చింది. గమనించిన కుక్కలు జింకపై దాడికి పాల్ప డి గాయపరిచాయి. హోం గార్డులు సురేశ్, అనిల్ కుక్కల బారినుంచి జింకను రక్షించారు. అనంతరం సానిపాయి రేంజ్ ఫారెస్టు అధికారులకు అప్పగించారు. వారిని ఫారెస్టు అధికారులు అభినందించారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండడంతో అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు లేకపోవడం వలన పల్లెల దగ్గరికి వస్తున్నాయని తెలిపారు. ఎవరికైనా అడవి జంతువులు కనపడితే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), ఫిబ్రవరి 12 : కడప నగరం ఎర్రముక్కపల్లెలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. సీకేదిన్నె మండలం ఇందిరానగర్‌కు చెందిన చిలకల జాన్ 40 క్వార్టర్ మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా అరెస్టు చేసి.. మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో సత్తాచాటిన సుబ్బయ్య


రన్నర్స్‌గా నిలిచిన ఆంధ్రజట్టులో పాల్గొన్న సుబ్బయ్య

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12: జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌లో లక్కిరెడ్డి పల్లెకు చెందిన కట్టా సుబ్బయ్య సత్తా చాటాడు. రాజాస్థాన్‌లో సోమవారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రజట్టు రన్నర్‌గా నిలిచింది. ఆంధ్ర జట్టు తరఫున ఆడిన వికలాంగుడు సుబ్బయ్య బౌలర్‌గా మంచి ప్రతిభ కనబరిచి ప్రశాంశ పత్రం అందుకున్నాడు. రాష్ట్ర దివ్యాంగుల ఉపాధ్యక్షుడు వెంకటరామరాజు, రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి సుబ్బయ్యను అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ ఛైర్మన్‌గా వెంకటరమణారెడ్డి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 12: అన్నమయ్య జిల్లా కాంగ్రెస్‌పార్టీ లీగల్‌సెల్ ఛైర్మన్‌గా తొట్లి వెంకటరమణారెడ్డి నియమితులయ్యా రు. ఈ మేరకు ఏపీసీసీ లీగల్‌సెల్ ఛైర్మన్ శాస్త్రి జంద్యాల ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లెలో న్యాయవాదిగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి లీగల్‌గా తన సేవలు అందిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు..

రైల్వేకోడూరు గుంజననది పక్కనే ఉన్న డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగలు



దంపింగ్‌యార్డులో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)



పొగలు వ్యాపిస్తున్నాయి..

- కమ్ముకుంటున్న కాలుష్యం
- రోగాలు వస్తున్నాయని ఆవేదన
- ఊరికి దూరంగా డంపింగ్‌యార్డు తరలించాలని వేడుకోలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 12: ఊరికి దూరంగా ఉండాల్సిన డంపింగ్ యార్డు పట్టణానికి అతి దగ్గరలో ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డంపింగ్‌యార్డులో ప్రతి నిత్యం వ్యర్థాలను కాల్చడంతో వచ్చే కాలుష్యంతో వ్యాధులు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయానికి సమీపంలో గుంజననది పక్కనే డంపింగ్‌యార్డు ఉంది. ఇక్కడకు సమీపంలో నరసరాంపేట, గుర్రప్ప పాళెం గిరిజన కాలనీతో పాటు వెంకయ్యస్వామి ఆలయం ఉంది. ఈ ప్రాంతంలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాలను కాల్చే సమయంలో పొగలు వ్యాపించడంతో పాటు దూళి వస్తోంది. దీంతో తాము రోగాల బారిన పడుతున్నామని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆస్మా, టీబీ తదితర వ్యాధులు ఉన్న వాళ్లు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. ఈ సమస్య గురించి పలుమార్లు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. రెండు రోజుల కిత్రం డంపింగ్‌యార్డులో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అయిన్పటికీ పొగలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డును ఊరికి దూరంగా తరలించాలని వారు కోరుతున్నారు.

రాజంపేట టీడీపీ ఎస్సీ సెల్ కార్యవర్గం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 12 : రాజంపేట టీడీపీ ఎస్సీ సెల్ కార్యవర్గాన్ని ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రకటించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా జ్యోతి శివశంకర్, ఉపాధ్యక్షులుగా శివ, మారే సురేష్, పొత్తపి పెంచలయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తల రాజబాబు, అధికార ప్రతినిధులుగా చంద్రమౌళి, రామచంద్రయ్య, కార్యవర్గ కార్యదర్శులుగా శ్రీపతి, సునీల్‌బాబు, యల్లయ్య, రామ్మోమన్, ఓబయ్యను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా శ్రీనివాసులు, బాలసుబ్బయ్య, రామాంజనేయులు, రఘునాథ, గంగాధర్‌ను ఎంపిక చేశారు. రాజంపేట రూరల్ అధ్యక్షుడుగా శివరామయ్య, పట్టణ అధ్యక్షుడుగా జడ శివ, ఒంటిమిట్ట ఎస్సీసెల్ అధ్యక్షులుగా శివశంకర్, సిద్దవటం అధ్యక్షులుగా హరిలను ఎంపిక చేశారు.

సుండుపల్లె మండల బీజేపీ అధ్యక్షుడుగా నాగరాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 12: మండల బీజేపీ అధ్యక్షుడుగా నాగరాజును ఎంపిక చేసినట్లు సోమవారం రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ప్రకటించారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్ తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు వెంకటరామరాజు తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

మహా స్వాప్నికుడు పుస్తక ఆవిష్కరణలో కువైట్ ఎన్ఆర్ఐ అధ్యక్షుడు

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 12: విజయవాడలోని దివిన్యూ కన్వెన్షన్‌లో జరిగిన మహా స్వాప్నికుడు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ కువైట్ ఎన్ఆర్ఐ జహరా అధ్యక్షుడు మల్లెం హేమంత్ కుమార్ పాల్గొన్నారు. టీడీపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరు ఈ పుస్తకం చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్ఆర్ఐ కువైట్ ప్రధాన కార్యదర్శి మల్లి మారోతూ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఫిబ్రవరి 12: మండలంలోని దిన్నెమీద పల్లెలోని నేతన ఆలయంలో సోమవారం నిర్వహించిన సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణోత్సవానికి రాయచోటి టీడీపీ నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బాణాల హరి

సిద్దవటం, ఫిబ్రవరి12 : సిద్దవటం మండలం టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శాఖరాజుపల్లె కు చెందిన బాణాల హరిని నియమించినట్లు సిద్దవటం మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి దశరథ నాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య తెలియజేశారు.

ఎల్.కె ఆడ్వాణీని కలిసిన చిట్వేలి నేత


అడ్వాణీతో పాటూరు శ్రీనివాసులురెడ్డి

చిట్వేలి, ఫిబ్రవరి 12 : చిట్వేలి మండల పరిధిలోని కె.ఎస్.అగ్రహారంకు చెందిన కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులు రెడ్డి, ఎల్.కె.అద్వానీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కె.ఎస్.అగ్రహారంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఢిల్లీలో భారతరత్న పురస్కార గ్రహీత ఎల్.కె.అద్వానీని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు వివరించారు.

'హార్సిలీ హిల్స్' రాసిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

● చమర్తి జగన్‌మోహన్‌రాజు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 12: దక్షిణ ఊటీగా పేరుగాంచిన హార్సిలీ హిల్స్‌పై ఉన్న ప్రభుత్వ భూమిని వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు రాయిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు హెచ్చరించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను వైసీపీకి మేలు చేకూర్చే విధంగా సినిమాలు తీసే డైరెక్టర్లకు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అడ్డుకుంటామన్నారు. ఇప్పటికే అసైన్మెంట్ కమిటీల పేరుతో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అర్హత లేకపోయినా అప్పనంగా డీకేటీ పట్టాలు ఇప్పించారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వైసీపీ పాలనలో చేసిన భూదందాలను, అసైన్మెంట్ కమిటీల అక్రమాలను వెలికి తీస్తామన్నారు. పేదల భూములు కొట్టేయాలన్న దుర్బుద్ధితో ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని కూడా తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎవరికి ఏ అన్యాయం జరిగినా సహజంగా కోర్టులను ఆశ్రయిస్తారని, కానీ భూ హక్కు చట్టంతో రైతులకు భూముల పరంగా ఏదైనా ఇబ్బంది కలిగితే కోర్టులకు వెళ్లే హక్కు కూడా లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఇప్పటికే ప్రజావిశ్వాసం కోల్పోయిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. హార్సిలీహిల్స్‌లో భూసేకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుగోపాల్‌రాజు, ఎస్టీ సెల్ నాయకులు రెడ్డినాయక్, రమణయ్య, సీఈ నాయకులు గంగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూ పంపిణీలో దళితులకు అన్యాయం


కలెక్టరుకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికసంఘం నేతలు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: డబ్బులు ఇచ్చిన వారి పేర్లు మాత్రమే భూ పంపిణీకి అర్హులుగా నమోదు చేసిన రెవెన్యూ అధికారులు మిగిలిన వారికి మొండి చేయి చూపారని రైల్వేకోడూరు వ్యవసాయ కార్మికుల సంఘం నేతలు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పండుగోల మణి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు నిరుపేద దళిత, గిరిజనులకు ఒక సెంటు భూమి ఇచ్చిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇప్పటికి 100 అర్జీలు పెట్టినా, రైల్వే కోడూరు మండల తహసీల్దార్ అసైన్మెంట్ భూములను పెత్తందారులకే కట్టబెడుతున్నారన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో 8వ విడత అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి నిజమైన నిరుపేద దళిత, గిరిజనులకు భూ పంపిణీ కార్యక్రమం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు రేవూరి శంకరయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చలంపాటి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి'

మాసాపేటలోని 3వ సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ లో 2021లో వార్డెన్‌గా విధులు నిర్వహించిన వ్యక్తి తన భార్య, ఆమె తమ్ముడి పేర్లతో అక్రమ లావాదేవీలు నిర్వహించాడని ఐఎఫ్ఎస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేయడంతోపాటు, ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశాడన్నారు. 2021 సంవత్సరంలో విద్యార్థుల బయోమెట్రిక్‌పై విచారణ చేయిస్తే అక్రమాలు బయటపడతాయన్నారు. ఐఎఫ్ఎస్ నాయకులు శివతేజ, ఉపేంద్ర పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి12: జిల్లాలో బజార్లలో, షాపుల్లో, అంగళ్లలో లోడింగ్ అన్ లోడింగ్ పనులు చేస్తున్న హమాలీ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు కోసం ఏఐటీయూసీ చాలాకాలంగా పోరాటం చేస్తోందని, అందులో భాగంగానే సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 45 ఏళ్ల దాటిన ప్రతి కార్మికుడికి నెలకు 6 వేలు పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలరన్నారు. పిల్లలు, గర్భిణులకు ఆర్థిక సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు రఘునాథ్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగులప్ప, నారాయణస్వామి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

పుల్లంపేట, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లెలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై కుమారునిపల్లెవాసులు సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలంలో కంచె వేసి మొక్కలు నాటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం కొండయ్య తాత జీవ సమాధి కావడంతో ఆ స్థలాన్ని తాము అత్యంత పవిత్రంగా భావిస్తామన్నారు. పండుగలతో పాటు, ఇళ్లలో శుభకార్యాల సమయాల్లో జీవసమాధి వద్ద పూజలు చేసే సంప్రదాయం ఉందన్నారు. ఈ స్థలంలోని 71 సెంట్లను యు.వి. అగ్రహారానికి చెందిన టి.ఎరుకలయ్య, పి.చలపతి రాత్రికి రాత్రి కబ్జా చేశారన్నారు. వెంటనే తహసీల్దారు స్పందించి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సర్వేయరు స్వాతితో సర్వే చేయిం చారు. ఈ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. జీవ సమాధి వద్ద యథా విధిగా పూజలు చేసుకోవచ్చునని గ్రామస్తులకు తెలియజేశారు.

'వైసీపీ గుర్తింపు రద్దు చేయాలి'

రాయచోటిటౌన్, ఫిబ్రవరి12: ఎన్నికల్లో గెలవడం కోసం అక్రమాలకు పాల్పడుతూ అధికారులను బలిచేసిన వైసీపీ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.

సోమవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలతో పాటు ఇతర తప్పిదాలకు పాల్పడే చిన్నస్థాయి అధికారులు, పెద్ద పెద్ద తిమింగలాలపై కూడా ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని వ్యవస్థల ద్వారా లబ్ధిపొందేందుకు జగన్‌రెడ్డి చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాడని, చివరకు ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి అధికార యంత్రాంగాన్ని భ్రష్టు పట్టించాడని, ఓటర్లను, అధికారులను ప్రభావితం చేస్తూ వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు చేస్తున్నాడన్నారు. దేశంలో గతంలో ఏ నాయకుడు చేయని విధంగా ఓటర్ల జాబితాను జగన్‌రెడ్డి దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల టీడీపీ అధ్యక్షుడు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకుడు రాఘవ, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి గుర్రం సుబ్బయ్య నాయుడు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి అలగాని రెడ్డెప్ప, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సావుద్, గాలివీడు క్లస్టర్ ఇన్‌చార్జి సత్యారెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఎస్‌యండీ రఫీ, రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌పై చెత్త.. ఆందోళనలో ప్రజలు



విద్యుత్ తీగలపై పడిన చెత్త

సంబేపల్లె, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని గుట్టపల్లె గ్రామం శతమానం భవతి కల్యాణ మండపం సమీపంలో విద్యుత్ తీగలపై పేరుకుపోయిన చెత్తా చెదారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అంటుకుని మండుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఈ విషయం లైన్‌మన్, ఏఈకి తెలియజేసినా పట్టించుకోలేదంటున్నారు. ఆ నిప్పు రవ్వలు గాలికి ఇళ్ల వద్దకు వస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విద్యుత్ లైనుకు సమీపంలో గడ్డివాములు ఉన్నాయని, ప్రమాదవశాత్తూ వాటికి నిప్పంటుకుంటే వేలాది రూపాయలు నష్టం సంభవించడంతోపాటు, పశుగ్రాసం లేకుండా పోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు లైన్‌పైన ఉన్న చెత్తను తొలగించి మంటలు ఆర్పి సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

వైభవంగా వీరభద్రుడి పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 12: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య భద్రకాళి, వీరభద్రుడి విగ్రహాలకు అభిషేకాలు చేసి, వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డి పర్యవేక్షించారు. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించండి


సిద్దవటం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం, ఫిబ్రవరి12 : మండలంలోని పెద్దపల్లె సర్వే నెంబరు 86/1లోని పొలంలో రీ సర్వే చేయించి తనకు న్యాయం చేయాలని టీడీపీ నేత కుప్పాల వెంకటసుబ్బయ్య సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనెంబరు 86/1 లో 12.60 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 1.74 ఎకరాలను తాను పట్నం వెంకటరమణ వద్ద కొనుగోలు చేసి రిజిష్టరు చేయించుకున్నామన్నారు. ఇటీవల బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన కొంత మంది వైసీపీ నేతలు ఆ భూమిలో నుంచి రస్తా కావాలని ఒత్తిడి చేయడంతోపాటు, అసత్య ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తహసీల్దారుకు విన్నవించినట్లు తెలిపారు. రస్తా విషయమై రీ సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఉపసర్పంచ్ ఎల్లారెడ్డి, పులి చిన్నయ్య, గాలి పెద్ద సుబ్బయ్య, ఎద్దుల శ్రీనివాసులు, జడ్పీ హైస్కూలు ఛైర్మన్ మునిస్వామి, పొలిశెట్టి శ్రీనివాసులు, ముస్లిం మైనారిటీ సోదరుడు, షేక్ మహబూబ్‌బాషా (బాబి) తదితరులు పాల్గొన్నారు.

17న హజరత్ ఖాజా సయ్యద్ నాదషావలీ ఉరుసు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12: ఈ నెల 17న మండలంలోని హజరత్ ఖాజా సయ్యద్ నాదషావలీ ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం సీటీఎం, రైల్వేగేటు వద్ద ఉన్న దర్గాలో రాత్రి 6 గంటల నుంచి గంధం పూల తాజియాలో గుర్రం మీద గంధం ఊరేగిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 10 వరకు అన్నదానం జరుగుతుందన్నారు.

యువత చూపు లోకేష్ వైపు..

●టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని


సమావేశంలో మాట్లాడుతున్న పంతగాని నరసింహ ప్రసాద్

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 12: రాష్ట్ర యువత టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ వైపు చూస్తోందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. భూ కబ్జాలు, లిక్కర్ , ఇసుక మాఫియాపై వైసీపీ నాయకులు పెట్టిన శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై పెట్టి ఉంటే యువతకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉండేవన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ జనసేన పార్టీలకు ప్రజలు పట్టం కట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బొక్కసం చలపతి, తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, కూని చంద్రయ్య, అమర్, కస్తూరి దినేష్, చిగురుపాటి శంకర, మందపాటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే గ్రామీణాభివృద్ధి'


ఇంటింటి ప్రచారం చేస్తున్న రేవతి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 12: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అని టీడీపీ యువ నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. సోమవారం మండలంలోని బుడుగుంటపల్లి, బొజ్జవారిపల్లి, వెంకటరెడ్డిపల్లి, అనంతరాజుపేట పంచాయతీలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ జనసేన అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బుడుగుంటపల్లి సీనియర్ నాయకులు సిద్ధేశ్వర, కొమ్మ శివ, దళిత నాయకులు తేనేపల్లి చిన్నా, విశ్రాంత తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆదిశంకరాచార్యుల మఠం


పూజలు నిర్వహిస్తున్న పండితులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 12: మండలంలోని కొత్తకోడూరు గ్రామంలో కోడూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆదిశంకరాచార్యుల మఠం ప్రారంభానికి సిద్ధంగా ఉందని అధ్యక్షుడు చింతూరు నరసింహ శర్మ తెలిపారు. సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆదిశంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని భక్తులు పాల్గొన్ని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధి కారి సురేష్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌పై డీఆర్ఎంకు వినతి


డీఆర్ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నేత సాయిలోకేష్

రాజంపేట, ఫిబ్రవరి12 : పార్లమెంటరీ కేంద్రమైన రాజంపేటలో, పార్లమెంటరీ పరిధిలోని ఇతర రైల్వేస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరుతూ రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ సోమవారం గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ వినీత్‌జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రైల్వే డీఆర్ఎం కడపకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిశారు. నంద్యాల, రేణిగుంట మీదుగా వెళ్లే రైళ్లను రాజంపేట, పుల్లంపేట, రెడ్డిపల్లె రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కడప-అరక్కోణం రైలును , హుబ్లీ-తిరుపతి రైలును రెడ్డిపల్లె రైల్వేస్టేషన్‌లో నిలపాలన్నారు. ఒంటిమిట్ట కోదండరామాలయానికి ప్రతి రోజూ వందలాది మంది భక్తులు వస్తుంటారని, కావున ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నంటికీ స్టాపింగ్ కల్పించాలన్నారు. ఈ ప్రాంతాలలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేనందున సుదూర ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీ 5వ వార్డులో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మ్రి సుమిత్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఐదో వార్డులో దాదాపు 100 కుటుంబాలకు పైగా పేదలు నివసిస్తుండగా, ఆ చుట్టుపక్కల ఎక్కడా అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, చిన్నపిల్లలు, బాలింతలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి అంగన్వాడీ కేంద్రం కేటాయింపుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు సుబ్బమ్మ, నసీజ్‌బాన్, సనా, మహిళ లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం


డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జీవో కాపీలను దహనం చేశారు. ఉపాధ్యాయ రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కొత్త సమస్యలు సృష్టిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ యువకులను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని పునరుద్ధరించడం శోచనీయమన్నారు. ఈ విధానాన్ని రద్దు చేస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజారమేశ్, జిల్లా కౌన్సిలర్ తిరుపతి అన్వర్‌బాషా, మధుసూదన్‌రాజు, హరికృష్ణ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిక


జనసేనలో చేరిన యువకులతో శ్రీనివాసరాజు

నందలూరు, ఫిబ్రవరి 12: మండలం నూకినేనిపల్లె పంచాయతీలోని బలిజపల్లె, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెకు చెందిన 20 మంది యువకులు సోమవారం యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. జెడ్పీ టీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామ రాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, కోసన నందు, రాజేష్, కుమార్, చెరువుపల్లి హరి, సిద్దు, శ్రీను, శ్రీహరి, శివ, నరేంద్ర, చిన్న, పుత్తా మోహన్, బోనాసి వంశీ, వర్ల కార్తీక్, జనసేన నాయకులు ఆకుల చలపతి, భారతాల ప్రశాంత్, తిప్పాయపల్లె ప్రశాంత్, వెంకటసుబ్బయ్య, మహేష్, సునీల్ గౌడ్, శ్రీకాంత్, వంశీ, కార్తీక్, చంద్రశేఖర్, మోహన్, హరి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో 'పల్లెకు పోదాం'


కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నేతలు

నందలూరు, ఫిబ్రవరి 12: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ నేతలు టంగుటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మైనారిటీ నేత షబ్బీర్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించామని తెలిపారు. సమర్పణ దివస్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు బీజేపీ ఇన్‌చార్జి ఆదినారాయణ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన జిల్లా కో-ఆర్డినేటర్‌గా దినేష్ జైన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 12: జనసేన పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా కె.దినేష్ జైన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

కనికల చెరువు వద్ద ఏనుగుల మంద మకాం

సోమల,ఫిబ్రవరి12:సోమల మండలంలో సంచరిస్తున్న ఏనుగుల మంద ఆదివారం రాత్రి ఇర్లపల్లె సమీపంలో మకాం వేశాయి. మామిడి తోటల్లో తిరగాడి కొమ్మలను విరిసివేశాయి. పూతకు వస్తున్న కొమ్మలు విరిగిపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. పగటి వేళ కనికల చెరువు వద్ద మకాం వేసి రాత్రి వేళల్లో పొలాల్లో తిరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కనికల చెరువు వద్ద నీటి నిల్వ ఉండడంతో ఆప్రాంతంలోనే తిరుగుతున్నాయని రైతులు తెలిపారు. దీంతో గొర్రెలు, మేకల పెంపకదారులు మేత కోసం వెళ్లడంలేదని తెలిపారు.

శ్రీకాళహస్తిలో విజృంభిస్తున్న మంప్స్

● అల్లాడుతున్న పిల్లలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తిలో గవదలమ్మ (మంప్స్) విజృంభిస్తోంది. వారం రోజుల నుంచి పిల్లల్లో అత్యధికంగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తుండడంతో పిల్లలు అల్లాడిపోతున్నారు. దవడలు వాచిపోవడం తోపాటు జ్వరం సోకుతుండడంతో నీరసించిపోతున్నారు.గవదలమ్మ పారామిక్సో వైరస్‌తో మొదలై తర్వాత చెవులకు దగ్గరగా ఉండే పరోటిడ్ గ్రంథిపై ప్రభావం చూపుతుంది. గవదల వాపు రావడం జరుగుతుంది. కొందరిలో సెంట్రల్ న్యూరల్స్ సిస్టం (మెదడు)పై ప్రభావం చూపి ప్రాణాంతకంగా కూడా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ వైరస్ ఒకే గదిలో దగ్గరగా ఉన్నవారికి, అలాగే జలుబు, దగ్గు ఉన్నవారి నుంచి వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారం రోజుల తర్వాత లక్షణాలు బయటపడతాయి. వందలాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గాలి, వెలుతురు సక్రమంగా లేని తరగతి గదుల్లో చదువుకునే పిల్లలపై మంప్స్ ప్రభావం చూపు తోంది. వారం రోజుల నుంచి పిల్లలు గవదలు వాచిపోయి జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరస్ సోకిన వారిని ఎవరితో కలవకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పాఠశాలల్లో ఈ జాగ్రత్తలు విధిగా పాటించాలి. సంబంధిత అధికారులు అవగాహన కల్పించడం తోపాటు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అప్రమత్తంగా వ్యవహరించాలి



పిల్లల్లో మంప్స్ వ్యాధిపై పెద్దలు అప్రమత్తంగా వ్యవహరించాలి. తీవ్ర సమస్యకు దారి తీసే ప్రమాదం ఉంటుంది కాబట్టి మొదటి దశలోనే గుర్తించి జాగ్రత్తలు పాటించాలి. సహజ పద్ధతిలో వేపాకు, పసుపు మిశ్రమాన్ని అద్దవచ్చు.ఇతర పిల్లలతో కలవకుండా చూసుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉంచాలి. శరీరం వైరస్ ప్రభావంతో నీరసంగా మారుతుంది కాబట్టి ఆరు రోజులు ద్రవ పదార్థాలను అధికంగా తాగించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల విషయంలో తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.

-డాక్టర్ వెంకటరామన్, సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు

టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలి

● అధికారులకు జేఈవో వీరబ్రహ్మం ఆదేశం

తిరుమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనం నుంచి సోమవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఆలయాలతోపాటు అలిపిరి వద్ద పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ ఖాళీ స్థలాల్లో మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకుని మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. శేషాచల అడవుల్లో అకేషియా చెట్ల స్థానంలో ఔషధ మొక్కలు పెంచాలన్నారు. 2025 టీటీడీ క్యాలెండర్లను స్థానిక ఆలయాల చిత్రాలతో మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, డడీఎఫ్‌వో శ్రీనివాస్, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డీఈవో భాస్కర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై నైతిక బాధ్యతతో సీఎం రాజీనామా చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 12: తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ సీఎం జగన్ రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్ల వ్యవహారం ఎమ్మెల్యేలు, మంత్రుల వల్ల అయ్యేది కాదని.. దీనివెనుక ముఖ్యమంత్రి హస్తముందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రెసిడెంట్ రూల్ తీసుకొస్తేనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను దేవుడు పంపిన దూతగా అభివర్ణించారు. తమిళనాడులో జయలలితలాగా ఏపీలో షర్మిల.. ముఖ్యమంత్రి అవుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సూత్రధారులైన వైసీపీ నేతలపై ఐపీసీని ప్రయోగించండి: బీజేపీ

తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల ప్రక్రియలో సూత్రధారుఐన వైసీపీ నేతలపై ఐపీసీని ప్రయోగించాలని, నకిలీ ఎన్నికల అధికారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉప ఎన్నిక సమయంలో దొంగ ఓట్లు వేసిన వారిని పోలీసులకు అప్పజెప్పితే వారిని వదలేసి.. తమను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలికి నేడు సస్పెండ్ కావడం ప్రభుత్వ యంత్రాంగానికి గుణపాఠం అని చెప్పారు. ఎప్పుడో జరిగిన ఎన్నికలకు సాక్ష్యాలు లేవని వైసీపీ నేతలు సంబర పడుతున్నారన్నారు. దొంగ ఓట్ల విషయంలో అసలు దోషులను చట్టం ముందుంచేవరకు తాము పోరాడతామని స్పష్టం చేశారు.

ప్రైవేటు వెంచర్ కోసం చెరువులో బాట!

●శ్రీకాళహస్తిలో రియల్టర్ల ఆగడాలు

● అధికార పార్టీ అండతో బరితెగింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి పట్టణ శివారు లోని బసవయ్యపాలెం వద్ద లింక్ బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువుపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. చెరువు భూమికి ఆనుకుని వేసిన వెంచర్‌కు దారి కోసం ఏకంగా పైపులు వేసి చెరువునే చదును చేసే పనులకు శ్రీకారం చుట్టారు.ఆరు నెలల క్రితం లింక్ బైపాస్ రోడ్డు నుంచి మొదట చిన్న రోడ్డు ఏర్పాటు చేసి తర్వాత సుమారు రూ.20 కోట్ల చెరువు భూమి స్వాహా చేసేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు సాగించారు.ఈ విషయంపై శ్రీకాళహస్తిలో భూరాబందులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పనులాపేశారు.మళ్లీ డిసెంబర్ 25వ తేదీన బసవయ్యపాలెం చెరువులోకి బాట వేసేందుకు రాత్రికి రాత్రి చదును చేశారు.ఈ విషయాన్నీ ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో మరికొంతకాలం చెరువు కబ్జాకు అడ్డుకట్ట పడింది.ఇటీవల కొయ్యల అమ్మకాలు చేసే కొందరు చెరువు భూమికి ఆనుకుని ల్యాండ్ కన్వర్షన్, అప్రూవల్ తీసుకోకుండానే ప్లాట్లు వేశారు.కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఒకరి భూమి గుండా రోడ్డు చూపుతూ ప్లాట్లు అమ్మేశారు.దీంతో ఆ భూమి యజమాని తన స్థలానికి కంచె వేసుకోవడంతో ప్లాట్లకు దారి లేకుండాపోయింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అమ్మకందారులను నిలదీయం మొదలుపెట్టారు.ఈ పరిస్థితుల్లో రియల్టర్లు బసవయ్యపాలెం పంచాయతీలోని ఓ కీలక వైసీపీ నేతతో చేతులు కలిపారు. చెరువు భూమిలో పైపులు వేసి బైపాస్ నుంచి ప్లాట్లకు రోడ్డు వేసేందుకు పథకం రచించారు. అధికారుల చేతులు తడపడంతో ఇక అడిగే వారుండరన్న ధీమాతో సిమెంట్ పైపులను దించి రాత్రివేళ చెరువు భూమిలో బాట వేసేందుకు సన్నద్ధమయ్యారు.సోమవారం సాయంత్రం చెరువును పూడ్చేందుకు పొక్లయినరును కూడా తరలించారు. అర్ధరాత్రి సిమెంట్ పైపులపై టిప్పర్లతో మట్టి తోలేందుకు సిద్ధమయ్యారు. బైపాస్ నుంచి ఇదే రోడ్డు ఏర్పాటయితే మొత్తం చెరువుకు చేటు తప్పదు. అందుకే గత పాలకులు చెరువులోకి బాటలు వేయకుండా రక్షించారు.అయితే ఇప్పటి పాలకులు రియల్టర్లతో చేతులు కలిపి చెరువు భూమిని అరగించేందుకు సిద్ధమయ్యారు.

పేటమిట్టకు ఆధ్యాత్మిక శోభ

● వేడుకగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం





పేటమిట్టలో ఏర్పాటు చేసిన యాగశాల - ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు



పూజల్లో పాల్గొన్న గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి దంపతులు

పూతలపట్టు, ఫిబ్రవరి 12: ఓవైపు పచ్చని తోరణాలు. మరోవైపు విద్యుత్ దీపాలంకరణతో పేటమిట్ట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. చిత్తూరు- కడప జాతీయ రహదారిలోని తలపులపల్లి నుంచి పేటమిట్ట వరకు రోడ్డుకు రెండైవపులా శ్రీరామ పతాకాలు రెపరెపలాడాయి. పూతలపట్టు మండలం పేటమిట్టలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. అమరరాజా సంస్థల అధినేత డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కుటుంబ సభ్యుల తొలి పూజతో ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు సమస్త దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పేటమిట్ట, గణపతిరావూరు, పోటుకనుమ, కరణంవారిపల్లి, కొట్లపల్లి గ్రామాల్లో ఊరేగించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 10 గంటలకు గల్లా కుటుంబీకులు ఇంటి నుంచి మంగళవాయిద్యాలతో విరుపాక్షమ్మ గుడి వద్దకు వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం యాగశాలకు చేరుకుని, అక్కడ గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీపారాధన వంటి పలు పూజాకైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం శాలివాహనం, షోడసస్తంభార్చన, అఖండదీపారాధన, వాస్తు మండపారాధన, వాస్తు హోమం, వాస్తు పర్యగ్నికరణం, వాస్తుబలి, క్షేత్రపాలక యోగని, నవగ్రహ మండపారాధన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసి, సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. గల్లా కుటుంబీకులతో పాటు సర్పంచి గల్లా రాధాకృష్ణ, ట్రస్ట్ సెక్రటరీ గల్లా రాజశేఖర్, ట్రెజరర్ గల్లా రామానాయుడు, ట్రస్టు సభ్యులు భానుమూర్తి నాయుడు, గల్లా రాజగోపాల్, గల్లా సంపత్ నాయుడుతో పాటు వీఆర్వోలు బాబ్జీ, చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.

శ్మశానానికి మా భూమే కావాల్సి వచ్చిందా..!

● అధికారులతో కలిసి అధికారపార్టీ నేతల ప్రయత్నం

● 'స్పందన'లో దళిత మహిళ ఆవేదన

చిత్తూరు, ఫిబ్రవరి 12: 'మా అనుభవంలో ఉన్న భూమిపై అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ భూమిని శ్మశాన వాటికగా మార్చేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి ప్రయత్నిస్తున్నారు' అంటూ చిత్తూరు మండలం అనుప్పల్లెకు చెందిన దళిత మహిళ నిరూప ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె దళిత సంఘాల నేతలతో కలిసి కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా వివిధ సమస్యలతో సోమవారం పలు ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని స్పందన కార్యక్రమంలో వినతులిచ్చారు. డ్వామా పీడీ రాజశేఖర్, ఆర్డీవోలు వినతిపత్రాలను స్వీకరించారు. బాధితుల సమస్యలను విన్నవారు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎండలు ప్రారంభమైన నేపథ్యంలో అర్జీదారుల సంఖ్య తగ్గింది. 212 మంది వినతిపత్రాలను అందించారు. ఇందులో రెవెన్యూశాఖకు 156, రేషన్‌కార్డులు, పెన్షన్ల కింద 12, పోలీసుశాఖకు 12 అర్జీలు పోనూ మిగిలిన శాఖలకు సంబంధించి అర్జీలున్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన వాటిలో కొన్ని..



అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

పోలీసు స్పందనకు 18 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు జిల్లా నలుమూలల నుంచి 18 మంది హాజరై వినతిపత్రాలను అందించారని ఎస్పీ జాషువా తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఇందులో భూ తగాదాల కింద 9, చీటింగ్ 4, ఆస్తి తగాదాలు 3, భర్త వేధింపులు 2 చొప్పన అర్జీలు అందాయి. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ అరీఫుల్లా, డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



కలెక్టరేట్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సంఘ సభ్యులు నిర్వహిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా జీవామృతం, ఘన జీవామృతాలతో పండించిన ఆకు కూరలు, కూరగాయలను విక్రయిస్తున్నారు. తాజాగా ఉండటంతో మహిళా ఉద్యోగులు కొనుగోలు చేశారు. గత పది వారాలుగా ఇక్కడ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అధికారులకు అవగాహన ఉండటం వల్ల చాలామంది తీసుకుంటున్నారని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తెలిపారు. ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ నిర్వాహకురాలు ఫైజున్నీషా, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



హమాలీ హెడ్ లోడ్ యాక్ట్ చట్టాన్ని అమలు చేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు జరిగిన హమాలీ వర్కర్ల ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25 లక్షల మంది వరకు పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో హమాలీ హెడ్‌లోడ్ యాక్ట్ చట్టం అమలులో ఉందని, ఇక్కడ మాత్రం లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న విధంగానే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కార్మికులకు ఏడాదికి ఒకసారి వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, నాయకులు మణి, రఘు, కృష్ణన్, కమల్, మణి, హమాలీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామానికి దారి వసతి కల్పించండి



తమ గ్రామానికి దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ జీడీనెల్లూరు మండలం కొల్లావూరు గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కొత్రకోన పంచాయతీ కొల్లావూరుకు ఉన్న చిన్నదారి ఆక్రమణకు గురికావడంతో పూర్తిగా దారిలేకుండా పోయిందన్నారు. జరగరాని సంఘటన ఏదైనా జరిగితే అంబులెన్స్ రావడానికి కూడా దారి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎవరిని అడిగి ఉద్యోగులను నియమించారు ?

● వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించిన సీహెచ్‌సీ చైర్‌పర్సన్



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ యశోదారెడ్డి

పెనుమూరు, ఫిబ్రవరి 12: ఎవరిని అడిగి ఉద్యోగులను నియమించారని సిబ్బంది, డాక్టర్లను సీహెచ్‌సీ చైర్మన్ యశోదారెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆమె మండల వైసీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మరి కొందరు నాయకులతో పెనుమూరు సీహెచ్‌సీని సందర్శించారు. నూతనంగా నియమితులైన శానిటేషన్ ఉద్యోగులను పిలిచి మీకు ఎవరు ఉద్యోగం ఇచ్చారని అడిగారు. అందుకు వారు సమాధానం చెప్పలేకపోయారు. సీహెచ్‌సీ హెడ్ డాక్టర్ గీతాకుమారి రెండు రోజులు సెలవులో ఉండటంతో ఆమెకు ఫోన్ చేసి నలుగురు శానిటేషన్ సిబ్బంది, ఒక సెక్యూరిటీని ఎవరు నియమించారని, చైర్మన్‌కు గానీ డిప్యూటీ సీఎంకు గానీ సమాచారం లేకుండా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఆరు నెలలుగా ఖాళీలు ఉంటే చెప్పాలని వైసీపీ నాయకులు అడుగుతున్నా ఖాళీలు లేవని చెప్పి ఇప్పుడు ఎలా, ఎవరు చేర్చుకున్నారని అడిగారు. తాను సెలవులో ఉన్నానని, నేరుగా వచ్చి మాట్లాడతానని డాక్టరు సమాధానం చెప్పారు. డిప్యూటీ సీఎంకు విషయం తెలిపేవరకు వారిని విధుల్లోకి తీసుకోరాదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పండరీనాథ్, రామకృష్ణ, యతీశ్వర్ నాయుడు, నరసింహారెడ్డి, కిరణ్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు డబ్బులకు అమ్ముకున్నారని ప్రచారం

పెనుమూరులోని సీహెచ్‌సీలో కాంట్రాక్టు పాతిబేసిస్‌గా శానిటేషన్ ఉద్యోగాలను అధికారపార్టీకి చెందిన ఓ నేత, మరో అధికారితో కలిసి అమ్ముకున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై పలువురు అడిగినా చైర్‌పర్సన్ చెప్పారని అనడం దుమారం లేపింది. దీంతో సీహెచ్‌సీ చైర్‌పర్సన్ యశోదారెడ్డే విచారించారు. తన పేరు ఎలా చెబుతారు.. ఎవరు మిమ్మల్ని చేర్పించారో చెప్పాలని ఆ ఉద్యోగులను అడగ్గా, వారు సమాధానం చెప్పకుండా కంటతడి పెట్టినట్లు తెలిసింది. ఈ విషయంలో ఎవరి పాత్ర ఉందో తేలేవరకు విధులకు రాకూడదని ఆమె చెప్పారు.

ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్







రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు రాకెట్ తరలింపు



ప్రయోగ వేదికపై రాకెట్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించి అనుసంధాన పనులు పూర్తయ్యాయి. 2,275 కిలోల బరువు గల కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు ప్రయోగించేందుకు షార్ శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ- మార్క్2 సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం ఇస్రో ఈ ప్రయోగం చేపట్టిన విషయం తెలిసిందే. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో (వ్యాబ్) రాకెట్ మూడు దశల అనుసంధాన పనులతో పాటు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను పూర్తి చేసి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించారు. ప్రయోగ వేదిక ఉన్న జీఎస్ఎల్వీ రాకెట్‌కు లెవల్-1, లెవల్-2 తనిఖీలను చేపడుతున్నారు. తుది పరీక్షల అనంతరం లాంచ్ రిహార్సల్, ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించారు. అన్నీ సజావుగా సాగితే ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి ఎగరనుంది.

పీలేరు పట్టణంలో చోరీ

పీలేరు, ఫిబ్రవరి 12: పీలేరు పట్టణం ఆజాద్ వీధిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సంగతి తెలుసుకున్న దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులోని 27 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.21 వేల నగదు అపహరించుకెళ్లారు. ఆజాద్ వీధికి చెందిన అల్లాబకష్ ఆదివారం సాయంత్రం తన కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూలేరన్న విషయం తెలుసుకున్న దుండగులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న అల్లాబకష్ చోరీ జరిగిన విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే దొంగలు తమ వేలిముద్రలు పోలీసులకు దొరకకుండా ఉండేందుకు బీరువాతోపాటు ఇంటిని నీళ్లతో తడిపేశారు. పీలేరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 12:వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ కిల్లారివాండ్లపల్లెకు చెందిన టి.శ్రీనివాసులు(32) కుటుంబానికి అదే గ్రామానికి చెందిన చిన్నరమణయ్య కుటుంబానికి పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శ్రీనివాసులు ఇంటి బయట ఉండగా పాత కక్షను మనుసులో పెట్టుకొని చిన్నరమణయ్య, అతని కుమారులు రమేష్, రవిలు కర్ర, గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీనివాసులు తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయపడిని అతడిని వాల్మీకీపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. బాధితుని తండ్రి పెద్దరమణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మండల కో-ఆప్షన్ సభ్యుడి మృతి


రెడ్డిసాహెబ్ (ఫైల్‌ఫొటో)

పీలేరు, ఫిబ్రవరి 12: పీలేరు మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎస్.రెడ్డిసాహెబ్ అలియాస్ సోమెనీ రెడ్డిబాషా(72) సోమవారం ఉదయం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతూ చివరి శ్వాస విడిచినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు స్థానిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

విగ్రహాల దాతకు పలువురి పరామర్శ


పెంచులయ్యను పరామర్శిస్తున్న ఆలయాల కమిటీల చైర్మన్లు

పీలేరు, ఫిబ్రవరి 12: పీలేరుతోపాటు పరిసర మండలాల్లోని అనేక ఆలయాలకు విగ్రహాలను అందించి విగ్రహాల దాతగా పేరుగాంచిన పీలేరు రౌద్రాల అంకాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ నారకట్ల పెద్దపెంచులయ్యను సోమవారం పలువురు పరామర్శించారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటికి పరిమితైతనమైన విషయం తెలుసుకున్న పీలేరు వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, సదుం రోడ్డులోని సీతారామస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ప్రముఖ వైద్యులు మల్లిఖార్జున సోమవారం పరామర్శించారు. ఎన్నో ఆలయాల జీర్ణోద్ధరణ, నూతన ఆలయాలకు విగ్రహాల ఏర్పాటుకు సహకరించిన పెద్దపెంచులయ్య త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

బీఎల్ఓలకు ఈవీఎంలపై శిక్షణ

రామసముద్రం, ఫిబ్రవరి 12: రామసముద్రం మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలకు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో హేమలత అధ్యక్షతన ఈవీఎంలపై కోసం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఎల్‌ఓలు కీలకపాత్ర పోషించాలని అందుకు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈవీఎంలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రామసముద్రం, ఫిబ్రవరి 12: మండలంలోని పెద్దకురప్పల్లి, ఆర్ మతంపల్లి, ఆర్ నడింపల్లె గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ చంద్రశేఖర్ సోమవారం పరిశీలించారు. రాబోయే ఎన్నికల దృష్టిలో ఉంచుకుని ఓటింగ్ జరిగే సమయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పరిసరాలను పరిశీలించి తగు ఏర్పాట్లు చేయడం కోసం ఈ పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ దామోదర్ పాల్గొన్నారు.

బీజేపీ తంబళ్లపల్లె మండలాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి



తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12: భారతీయ జనాతా పార్టీ తంబళ్లపల్లె మండల అధ్యక్షుడిగా కన్నెమడుగు పంచాయతీ కు.రామిగానిపల్లెకు చెందిన ఏ.భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాజంపేట పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ..తంబళ్లపల్లెలో బీజేపీని బలోపేతం చేసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 12: అన్నమయ్య జిల్లా కాంగ్రెస్‌పార్టీ లీగల్‌సెల్ చైర్మన్‌గా తొట్లి వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ శాస్త్రి జంధ్యాల ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లెలో న్యాయవాదిగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి లీగల్‌గా తన సేవలు అందిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు..

రేపు జయహో బీసీ కార్యక్రమం

కలికిరి, ఫిబ్రవరి 12: కలికిరి పట్టణంలో జయహో బీసీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు రాజంపేటపార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఈ సమావేశాలకు హాజరవుతారని చెప్పారు. క్రాస్‌రోడ్డులోని ఏహెచ్‌సీ కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయాలను సమావేశంలో చర్చిస్తామన్నారు. మండలంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాలకు చెందిన క్రియాశీలురు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాల్సిందిగా చంద్రశేఖర్ కోరారు.

ఇనుప విద్యుత్తు స్తంభాలు మార్చరా?

● పలుచోట్ల తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్నవైనం ● నివాసాలను చుట్టేసిన విద్యుత్తు వైర్లు


త్యాగరాజవీధిలో నివాసాలకు ఆనుకుని వెళ్తున్న ఇసుప విత్యుత్తు స్తంభాలు


తుప్పు పట్టిన విద్యుత్తు స్తంభం

మదనపల్లె, ఫిబ్రవరి 12: మదనపల్లె పట్టణంలో 50-60 ఏళ్ల క్రితం నాటిన పాత విద్యుత్తు స్తంభాలే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. ఒక్కో స్తంభానికి పదుల సంఖ్యలో వైర్లు అతికించి ఉండడం. ఇనుప స్తంభాలు పలు చోట్ల తుప్పుపట్టి విరిగిపోవడానికి సిద్ధంగా ఉండడంతో ఏదైనా ప్రమాదం జరిగితేగాని పట్టించుకోరా? అంటూ పట్టణ ప్రజలు వాపోతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఇనుప విద్యుత్తుస్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నా వాటి స్థానంలో కొత్తవాటి ఏర్పాటు చేయాలన్నా ప్రతిపాదనను అటు మున్సిపల్, ఇటు ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఏదైనా అనుకోని రీతిలో ప్రమాదం సంభవిస్తే తప్పా..అధికార యంత్రాంగం కదలడం లేదు. ప్రభుత్వం కొత్తగా చేపట్టిన గడపగడపకు పేరుతో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఆయాశాఖల అధికారులు ఇంటింటికీ ప్రజాసమస్యలపై ఆరాతీశారు. ఇందులో విద్యుత్తు స్తంభాలు వంగిపోయాయని, తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్నాయని, వర్షాల కాలంలో ఇనుపస్తంభాలకు విద్యుత్తు సరఫరా అవుతోందని చెప్పారు. అలాగే పట్టణం రోజురోజుకు విస్తరించడంతోపాటు ఉన్న ఏరియాలోనే నివాసాలు పెరగడంతో కనెక్షన్లు కూడా పెరిగి వైర్లు ఎక్కడిక్కడ గజిబిజిగా మారాయని ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా పాత మదనపల్లెలోని ఇరుకైన వీధులు, సందుల్లో ఇనుప విద్యుత్తు స్తంభాలు కొన్ని ఇళ్లకు ఆనుకుని, ఇంటినిర్మాణంలో కలసిపోయి ఉన్నాయి. దీంతో మిద్దెపైకి వెళ్లాలన్నా, అక్కడ నివాసం ఉండాలన్నా ప్రజలు జంకుతున్నారు. ఇదిలాఉండగా, గడప గడపకు ప్రభుత్వం కార్యక్ర మంలో చాలా ఏరియాలలో ఇళ్లపై, ఇళ్లకు ఆనుకుని వెళ్తున్న, ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్తు స్తంభాలను మార్చేశారు. కొన్ని చోట్ల మాత్రం అలాగే పెట్టేశారు. ఈ ఇనుపవిద్యుత్తు స్తంభాలు తుప్పుపట్టి కొన్ని కూలడానికి సిద్ధంగా ఉండగా, మరికొన్నింటికి సిమెంటు కాంక్రీటుతో దిమ్మెలు నిర్మించారు. ముఖ్యంగా త్యాగరాజవీధి, రాఘవేంద్రస్వామివీధి, నెహ్రూబజార్, సంత బజారు, గుండ్లూరు వీధి, పంచరత్నసినియా థియేటర్ ఏరియా, శేషప్ప తోట, కోటగడ్డ, కొత్తపేట, దేవళంవీధి, క్రిష్ణవిద్యాలయం వీధి, పోతులప్ప వీధి, పూలవీధి, సైదాపేట, ఇందిరానగర్, తదితర ప్రాంతాల్లో ఇనుప విద్యుత్తుస్తంభాలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే స్తంభాలు మార్చిన ఏరియాలలో చిత్తూరుబస్టాండు, కమ్మవీధి, సాయిబాబగుడి ఏరియా, లచ్చారెడ్డివీధి, నిమ్మనపల్లెరోడ్డు, సుభాష్‌రోడ్డు, తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ ఏరియాలు సందులు, గొందులుగా ఉండటంతో పాత స్థంభాన్ని తొలగించడానికి, దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి వాహనం వెళ్లదని, సామగ్రి మొత్తం మోసుకెళ్లాలని, సిమెంటురోడ్లు కావడంతో గుంతలు వేయడానికి ఇబ్బందిగా ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే ఎలాగైనా పనిచేద్దామన్నా..దానికి సరిపడా బిల్లులు మంజూరు కావడం లేదంటున్నారు.

ముత్యపు పందిరి వాహనంపై శ్రీనివాసుడు


ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తున్న స్వామి వారు


సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా వేంకటరమణ స్వామి వారు శ్రీదేవి, భూదేవీలతో కలిసి ముత్యపుపందిరి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజైన సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వేంకటరమణ స్వామి ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనంపై నుంచి భక్తులను కటాక్షించారు. వేదపండితులు సోమవారం వేకువజామునే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం 8 గంటల నుంచి శ్రీదేవి భూదేవి సమేత వేంకటరమణ స్వామి వారు ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరి విశేష పూజలందుకున్నాడు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు సింహ వాహనంపై ఆసీనులై పూజలందుకుని అనంతరం ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న దేవదేవుడికి భక్తులు కర్పూర నీరాజనాలు పలికారు.

భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని వాహన సేవల్లో పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో బాగంగా వెంకన్నకు మంగళవారం ఉదయం కల్పవృక్షవాహనము, రాత్రికి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. కార్యక్ర మంలో ఆలయ సూపరింటెండ్ మునిచెంగల్రాయులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న అవార్డుపై హర్షం


భారతరత్న అవార్డులు పొందిన వారికి పూలమాల వేసి ధన్యవాదాలు తెలుపుతున్న నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12: ఇటీవల భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల శంకర బ్రాహ్మణ సేవా సహకార సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక శంకర బ్రాహ్మణ సేవా సంస్థ కార్యాలయంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే వ్యవసాయ రంగంలో విశేషంగా కృషి చేసి భారతదేశాన్ని ఆహార సంక్షోభం నుంచి గట్టెంకించిన హరిత విప్లవ కారుడు ఎంఎస్ స్వామినాథన్‌కు, అయోధ్య రామాలయ నిర్మాణానికి నాంది పలికిన ఎల్‌కే అద్వానీకి అత్యంత గౌరవప్రదమైన భారతరత్న పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కామకోటి ప్రసాదరావు, మదనపల్లె అధ్యక్షుడు కోదండరామయ్య, సలహాదారులు గట్టు ప్రకాష్, కేవీఎస్ శర్మ, పద్మారాణి, తదితరులు పాల్గొన్నారు.

విషాహారంతోనే పాడిఆవులకు కామెర్ల వ్యాధి



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 12: విషం కలిగిన ఆహార పదార్థాలను తినడం కారణంగానే పాడిఆవులకు కామెర్ల వ్యాధి సోకుతుందని పశుసంవర్ధక శాఖ ఏడీ రోహిణి పేర్కొన్నారు. సోమవారం మం డలంలోని అగ్రహా రం పంచాయతి చెరువుముందరపల్లిలో అంతు చిక్కని వ్యాధితో రెండు ఆవులు చనిపోయాయి. ఇందులో ఒక ఆవుకు బీమా ఉండంతో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆమె మాట్లాడుతూ ఆవుకు ఇచ్చే ఆహారంలో తేమ శాతం ఎక్కువగా వుంటే అవి కుల్లి పోయిన తరువాత ఆవులు తింటే కామెర్లకు దారితీస్తుదన్నారు. ఇవే కాకుండా కుళ్లిన నీటిని ఆవుకు తాపడంవలన వాటికి జీర్ణశక్తి తగ్గిపో యి చనిపోయేప్రమాదం ఉందన్నారు. ప్రసుతత్త చనిపోయిన ఆవులు కూడా కామెర్లు సోకి చనిపోయినట్లు తెలిపారు. ముఖ్యంగా గోమర్లు, పిడుదులు, వుంటే వాటిని శుభ్రం చేయాలని లేని పక్షంలో రక్తహీన తకు గురై ఆవులు మరణిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పాడి అవులకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం జబ్బుతో బాధపడుతున్న పాడి ఆవులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీ హసన్ సాబ్, పెథాలజిష్ట్ విష్ణు, పశు వైద్యాధికారులు సురేష్, ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

17న మదనపల్లెలో ఉరుసు


హజరత్ ఖాజా సయ్యద్ నాధషావలీ దర్గా

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12: మండలంలోని హజరత్ ఖాజా సయ్యద్ నాధషావలీ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 17న ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం సీటీఎం, రైల్వేగేటు వద్ద ఉన్న దర్గాలో రాత్రి 6 గంటలనుంచి గుర్రం మీద గంధం ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వారుపేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదాన కార్యక్రమంలో జరుగుతుందన్నారు. సీటీఎం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హిందూ ముస్లింలు పాల్గొని సీటీఎం ఉరుసు ఉత్సవాలను విజయవంతంచేయాలని నిర్వాహకులు కోరారు.

వేలం పాట ద్వారా మల్లయ్యకొండకు రూ.3,83,500 ఆదాయం


బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12: తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయానికి ప్రవేశించు వాహనాల టోల్‌గేట్ రుసుము వసూలు చేసుకొను హక్కును పొందడానికి వేలం పాట ద్వారా మల్లయ్యకొండకు రూ.3,83,500లు ఆదాయం వచ్చినట్లు ఈవో రమణ తెలిపారు. సోమవారం మల్లయ్యకొండపైన ఆలయం వద్ద ఆలయ చైర్మన్ కేఆర్‌మల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో వాహనాల టోల్‌గేట్‌కు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో తంబళ్లపల్లెకు చెందిన శేఖర్ రూ.3,83,500లు పాడి టోల్‌గేట్ రుసుము వసూలు హక్కును దక్కించుకున్నారు. కాగా, మల్లయ్యకొండ పనులకు సంబంధించి గత నెల 20న నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా రూ.15,04,500లు ఆదాయం వచ్చింది. దీంతో మల్లయ్యకొండకు ఈ ఏడాది వేలం పాటల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ.18,88,000లు చేరింది. కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ఆర్బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి


సచివాలయ ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో క్రిష్ణమూర్తి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..సచివాలయాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చొరవచూపాలన్నారు. సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి నుంచి వచ్చే అర్జీలను సకాలంలో స్పందించి పరిష్క రించాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఆనంద్‌కుమార్, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలకు కొత్త భవనం నిర్మించండి


గంగతాతగారిపల్లి పాఠశాల మూతపడిన భవనం ఇదే

పెద్దమండ్యం, ఫిబ్రవరి 12: పెద్దమండ్యం మండలం గంగతాతగారిపల్లి ప్రభుత్వ పాథమిక పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని గంగతాతగారిపల్లి, ముసలికుంటవారిపలి గ్రామస్థులు కోరుతున్నారు. గంగతాతగారిపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాథమిక పాఠశాలలో గంగతాతగారిపల్లి, ముసలి కుంట వారిపల్లి, బాలమ్మగారిపల్లి, బిల్లావారిపల్లి, నగిరి గ్రామాల పిల్లలు చదువుకునేవారు. అనంతరం హంద్రీ-నీవా కాలువ చేపట్టడంతో కాలువ భూసేకరణలో గంగతాతగారిపల్లి సమీపంలోని పాఠశాల మూతపడింది. అప్పట్లో సకాలంలో పాఠశాల భవనం నిర్మించక పోవడంతో ఆ పాఠశాలలోని విద్యార్థులను సి.గొల్లపల్లి పాఠశాలలో విద్యాశాఖ చేర్పించింది. సి.గొల్లపల్లి అదనపు తరగతి గది నిర్మాణానికి నిధుల కోసం విద్యాశాఖకు నివేదిక పంపినట్లు పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ తెలిపారు. ఆ పాఠశాలకు ఈ ప్రాంత విద్యార్థులు వెళ్లాలంటే దూరం కావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

కేసుల్లో ఉన్న భూమిని మున్సిపాలిటీకి కేటాయిస్తారా..?


సబ్‌కలెక్టరేట్ స్పందనలో అర్జీలు పరిశీలిస్తున్న డీఏవో రఫీక్‌అహ్మద్

మదనపల్లె టౌన్/అర్బన్, ఫిబ్రవరి 12: ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదంతో కోర్టులో కేసుల్లో ఉన్న భూమిని మున్సిపల్ కార్యాలయం నిర్మాణానికి ఎలా కేటాయిస్తారని బాధితురాలు వెంకటమ్మ స్పందనలో ఫిర్యాదు చేసింది. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో రఫీక్‌అహ్మద్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. బాధితురాలు వెంకటమ్మ మాట్లాడుతూ దళితులైన తమ భూములను ప్రభుత్వం తిరిగి లాక్కోవడానికి చూస్తోందని, అసలు ఆ భూమిపై ఇదివరకే జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. మదనపల్లె పట్టణం దేవతానగర్ వద్ద చర్కా సిల్క్ రీలింగ్ యూనిట్ల కోసం కేటాయించిన స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు డీఏవోకు ఫిర్యా దు చేశారు. హార్సిలీహిల్స్‌లో పదేళ్లుగా పండ్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్న తన దుకాణం ఎత్తి వేయించారని, కాని అక్కడ ఉద్యోగాలు చేస్తున్న ధనవంతుల దుకాణాల ను ఐదింటిని అలాగే కొనసాగిస్తున్నారని బాధితురాలు గంగులమ్మ ఫిర్యాదు చేసింది. స్పందనకు వచ్చిన అర్జీలను ఆయా మండలాల ప్రభుత్వశాఖల అధికారులు విచారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని డీఏవో సూచించారు.


మున్సిపల్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సుదర్శనం

మదనపల్లె అర్బన్‌లో: మండలంలోని కొండామరిపల్లె పంచాయతీలోని దళితవాడలో ఉండే రామాపురం వెంకటమ్మభర్త పట్టాపాసుపుస్తకం కలిగిఉన్నా మున్సిపల్ నూతనభవనాల నిర్మాణానికి కౌన్సిల్‌ఆమోదించడం తగదని మాలమహానాడు రాష్ట్రఅధ్యక్షుడు యమలా సుదర్శనం అన్నారు. ఆమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శిరీషాకు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయని, నిరుపేద మాలకులానికి చెందిన వెంకటమ్మ భూమిని స్వాధీనం చేసుకోవడం పట్ల అభ్యంతరం చెప్పారు. వెంకటమ్మకు న్యాయం చేయాలని ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు విన్నవించామన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులకు న్యాయం చేయకుంటే ఆందోళనలు తప్పవు


ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఎస్‌వై, ఆర్ఎస్‌యూ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 12: బీటీ కళాశాలలో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు జీతాల ప్రొసీడింగ్స్ రాకుండా చేస్తూ, అనర్హులకు జీతాలు వచ్చేలా వచ్చిన ఉత్తర్వులపై విచారించి న్యాయం చేయాలని లేకుంటే ఉద్యమాలు తప్పవని బీఎస్‌వై, ఆర్ఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీటీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆనందరెడ్డిని కలసి ఈ మేరకు వారొక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్‌వై అధ్యక్షుడు పునీత్, ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు ఉత్తన్న మాట్లాడుతూ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఇటీవల జీతాలు నిర్ణయిస్తూ ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇచ్చిందన్నారు. అందులో అనర్హుల పేర్లు ఉన్నాయని, ఆరుగురు అర్హుల పేర్లు లేకపోవడం బాధాకరమన్నారు. వాటిపై విచారించి అర్హులను న్యాయం చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ తా మన్నారు. కార్యక్రమంలో ప్రభు, సురేష్, నవీన్, సుధాకర్, ఆది, శశి, ప్రభాకర్ పాల్గొన్నారు.

సరిహద్దు చెక్ పోస్టుల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు

● కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
● ములకలచెరువు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ వెల్లడి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 12 : కర్ణాటక సరి హద్దుగా ఉన్న పీటీఎం మండలంలోని అన్ని చెక్‌పోస్టులలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా దృష్ట్యా పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టినట్లు ములకలచెరువు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి. రామ్మోహన్ వెల్లడించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ' జోరుగా కర్ణాటక మద్యం విక్రయాలు' అన్న శీర్షికన కథనం ప్రచురితమవ్వడంతో స్పందించిన ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ సోమవారం పీటీఎం మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి 10 లీటర్ల లోపు అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడితే కేసులు ఉండవన్నది అవాస్తవం. అయితే అటువంటి వారిని స్థానిక పోలీస్ స్టేషన్లలో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేస్తారు. కానీ అటువంటి వారు ఖచ్చితంగా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న 70 కేసులు నమోదు చేసి 85 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఇందులో 1128 లీటర్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, మద్యం తరలిస్తూ 26 వివిధ వాహనాలను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు పీటీఎం మండలంలో సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక అక్రమ రవాణాను నివారించేందుకు సరిహద్దుల్లో 4 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, పీటీఎం పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు కర్ణాటక మద్యం రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. పీటీఎం మండలంలోని ఏ గ్రామంలోనైనా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలిస్తే అటువంటి వారు 9440902534 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందిస్తే అటువంటివారి పేరును గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం..కారు సీజ్

● నిందితుడి అరెస్టు ● 1350 టెట్రా పాకెట్లు, 48 క్వార్టర్ బాటిళ్లు లభ్యం


వాల్మీకిపురంలో పోలీసులు సీజ్ చేసిన కర్ణాటక మద్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 12: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. సీఐ పులిశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాల్మీకిపురం రైల్వే స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ39వీయు5483 నెంబర్ గల కారులో అను మానాస్పద సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 1350 టెట్రా మద్యం పాకెట్లు, 48 క్వాటర్ బాటిళ్ల బయటపడ్డాయి. మద్యంతో పాటుగా కారును సీజ్ చేసి, అక్రమ రవాణాకు పాల్పడిన వాల్మీకిపురంకు చెందిన వ్యక్తి నరసింహులు(36)ను అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది సతీష్, అబ్దుల్లా, రిజ్వాన్, రామచంద్రనాయక్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో కుష్ఠువ్యాధిపై అవగాహన


కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి శ్రీనివాసులు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 12 : మండల కేంద్రమైన పీటీఎం లోని ఆదర్శ పాఠశాలలో సోమవారం కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అన్న మయ్య జిల్లా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (డీపీఎంవో) శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కుష్ఠువ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై వివరించారు. ముఖ్యంగా కొంతమంది శరీరంలో స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటి నివారణ మార్గాలను వారికి వివరించారు. ఈ కార్యక్ర మంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారితో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వైద్య సిబ్బంది సీహెచ్‌వో లక్ష్మీపతి, సూపర్‌వైజర్లు రెడ్డెప్ప, జనార్ధనలతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పారామెడికల్ అధికారి

కలకడలో:ప్రారంభ దశలోనే కుష్ఠువ్యాధిని గుర్తించి చికిత్స చేయడం వలన వ్యాధి నయమవుతుందని జిల్లా పారామెడికల్ అధికారి శంభుప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని కదిరాయచెరువులో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి బాధితులను గుర్తించడం జరుగుతుందన్నారు. డాక్టర్ జవహర్‌బాబు మాట్లాడుతూ వ్యక్తుల శరీరంపై రాగి రంగుల మచ్చలు ఏర్పడి స్పర్శ కోల్పోతే వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో బాధితులకు ఎంసీఆర్ పాదరక్షలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీప్రసన్న, సుధాకర్, సిబ్బంది జయరామయ్య, రెడ్డెమ్మ, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.